క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

విజయనగరం గంటస్తంభం: రానున్న వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతి గ్రామంలో పని చేయని బోర్లు ఉన్నాయని, తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. విస్తృతంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

వైభవంగా శ్రీమన్నారాయణ పారాయణం


రామతీర్థంలో పారాయణాలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రీమన్నారాయణ పారాయణాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. భగవత్ రామానుజా దాస బృంద ప్రతినిధులు శ్రీమత్ భాగవత మహా పురాణంలో వైభవాలను 15 అధ్యాయాలుగా సంకలనం చేసి ఓ ప్రత్యేక పుస్తకాన్ని తయారు చేశారు. సుమారు 108 పుణ్యక్షేత్రాల్లో పారాయణం చేసేందుకు నిర్ణయించారు. రామతీర్థంలో భక్తిశ్రద్ధలతో పారాయణాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో బృంద ప్రతినిధి కందాల రాజగోపాలాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు


రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న శివకుమార్

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తప్పవని జాతీయ పొగాకు నియంత్రణ కన్సల్టెంట్ పి.శివకుమార్ అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, పంచాయితీ రాజ్, పోలీస్, ఎక్సైజ్, వ్యవసాయ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద పాన్ షాపులను తనిఖీలు నిర్వహించి, అపరాధ రుసుం విధించారు. సిగరెట్, చుట్ట తాగిన వారికి పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల కల్గే అనర్థాలు వివరించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రమణ్యం, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ, సైకాలజిస్టు ఎస్‌వీరమణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఘటాలను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెఎన్ విడివి.ప్రసాద్ పర్యవేక్షించారు.

- ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయం అంతంత మాత్రమే
- నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న దుకాణాలు
- ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కార్పొరేషన్ అధికారులు


నగరంలోని దుకాణ సముదాయాలు

దుకాణాలెక్కువ.. ఆదాయం తక్కువ..!

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలుస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఖజానాకు ఆదాయం సమకూరడంలేదు. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరంలో ఎక్కడ పడితే అక్కడ వివిధ రకాల దుకాణాలున్నపటికీ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు సాగిపోతుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతి ఏడాదీ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. నిబంధనల ప్రకారం నగరంలో ఏ దుకాణం నడపాలన్న కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌ను వ్యాపారులు తగిన మొత్తం చెల్లించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్స్‌లు మంజూరు ప్రక్రియపై సంబంధిత అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఉన్నతాధికారులైన స్పందించి లైసెన్స్‌లు మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి, ఆదాయం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే..

గడిచిన కొన్నేళ్లలో పరిశీలిస్తే కార్పొరేషన్ ఖజానాకు ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో రావాల్సిన ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. 2018 – 19 సంవత్సరం నుంచి పరిశీలిస్తే అప్పట్లో 1600 వరకు దుకాణాలు, షాపులు ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి వస్తే.. 2022 – 23 సంవత్సరం నాటికి ఆ సంఖ్య 2219కి చేరింది. –ప్రస్తుత 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.31.82 లక్షలకుగాను శతశాతం వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గడిచిన ఆరేళ్లలో ఆదాయ లక్ష్యాలను పరిశీలిస్తే...

సంవత్సరం	లక్ష్యం (రూ.లక్షల్లో..)	వసూలు (రూ.లక్షల్లో..)
2018 - 19	రూ.18.77	రూ.12.51
2019 - 20	రూ.20.13	రూ.13.52
2020 - 21	రూ.20.39	రూ.12.13
2021 - 22	రూ.21.49	రూ.11.22
2022 - 23	రూ.25.03	రూ.13.23
2023 - 24	రూ.32.22	రూ.28.02

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

నగరంలో వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణదారుడు, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. విస్తరిస్తున్న నగరంలో రోజురోజుకూ దుకాణాల సంఖ్య పెరుగుతోంది. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి తీసుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు.

– డాక్టర్ సాంబమూర్తి, ప్రజారోగ్యాధికారి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

అయితే ఓ వైపు దుకాణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గతేడాదితో పోల్చుకుంటే డిమాండ్ తగ్గుముఖం పట్టడం గమనార్హం.

దుకాణాలు పెరుగుతున్నా ఆదాయం పెరగదేం..

జిల్లా కేంద్రం, ఆపై కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరం విజయనగరం. ఆ స్థాయికి తగ్గట్లే స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నగర రూపురేఖలు చాలా వరకు మారాయి. పెద్ద పెద్ద నగరాలకు దీటుగా ప్రధాన కూడళ్లు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ఈ భారాన్ని అధిగమించేందుకు వీలుగా ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, కల్యాణ మంటపాలు, మొబైల్ షోరూమ్‌లు, టిఫిన్ సెంటర్లు, వాహన షోరూమ్‌లు, రిపేర్ సెంటర్లు, తదితర దుకాణాలు ట్రేడ్ లైసెన్స్‌ల పరిధిలోకి వస్తుండగా... ఆ స్థాయిలో ఆదాయాన్ని సమకూరడం లేదు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, కోచ్

విజయనగరం: జిల్లా స్థాయి కరాటే పోటీలో విజయనగరం పట్టణంలోని గురుదత్త పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలను సాధించారు. ఈ విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 9, 10 తేదీలలో విజయనగరం పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే చాంపియన్ షిప్–2025 జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ఒ.శివగణేష్ కాటా, కుమిటే రెండు విభాగాలలో బంగారు పతకాన్ని సాధించాడు. పి.హేమంత్ కాటాలో బంగారు, కుముటీలో కాంస్య పతకం సాధించాడు. మహమ్మద్ సమీర్ కాటాలో కాంస్య, కుమిటీలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఆర్.ఇందిర ప్రియదర్శిని కాటాలో కాంస్య, కుముటీలో వెండి పతకం, సిహెచ్.రిషిత, హర్షవర్ధన్‌లు రెండింటిలో కాంస్య పతకం సాధించారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం పి.పద్మ శంకరరావు, కోచ్ కె.సంతోష్ అభినందించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో వేంచేసి ఉన్న బంగారమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎడ్ల బండ్లు పరుగు ప్రదర్శన జరుగుతుందని వివరించారు.

ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ఊరేగింపు


అమ్మవారి విగ్రహం ఊరేగింపు

నెల్లిమర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 10.39 నిమిషాలకు ఆలయంలో కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 8.30 గంటలకు శిలామూర్తులతో కరదీపిక, స్వస్తివాచన మంగళ వాయిద్యాలతో గోమాత, సమేత పుణ్యదంపతులతో యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు వేదపండితులు జరిపించారు. సాయంత్రం 4 గంటల నుంచి మత్సంగ్రహణం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్టాపన, మూర్తి మహాపూర్వక మూలమంత్ర హోమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పట్టణ ప్రధాన రహదారిలో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన మహిళల కోలాటం అందరినీ అలరించింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో కమిషనర్



దీర్ఘకాల ఆస్తి పన్ను మొండి బకాయిలను వసూలు చేసేందుకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య రంగంలోకి దిగారు. మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి తక్షణమే పన్ను చెల్లించాల్సిందేనని చెప్పగా వారు చెల్లించారు. కమిషనర్ ఆదేశాలతో సహాయ కమిషనర్ కె.అప్పలరాజు కూడా పలు దుకాణాలు, విద్యా సంస్థల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. కొందరు మొండి బకాయిదారుల దుకాణాలను ఉన్నతాధికారులు దగ్గరుండి మూసి వేయించారు. దీంతో వారంతా గంటల్లోనే బకాయిలను చెల్లించారు. సచివాలయాల పరిధిలో నీటి పన్ను చెల్లించని వారి కుళాయి కనెక్షన్లను తొలగించారు. – విజయనగరం

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

భోగాపురం: పోలిపల్లి పైడితల్లిని, భోగాపురంలోని కనకదర్గమ్మ అమ్మను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సతీ సమేతంగా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడితల్లి, కనకదర్గమ్మ అమ్మవార్ల జాతర నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు.

28న న్యాయవాదుల సంఘ ఎన్నిక

విజయనగరం లీగల్: విజయనగరం పట్టణ న్యాయవాదుల సంఘ ఎన్నికల షెడ్యూల్ మంగళవారం విడుదలైంది. ఓటింగ్ ప్రక్రియ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు చొక్కాపు దాము, కంటుభుక్త శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. 24న దరఖాస్తుల ఉపసంహరణకు గడువుగా చెప్పారు. ఈ నెల 28న న్యాయవాదుల సంఘ భవనంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ, సాయంత్రం 4 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై అదే రోజున ఫలితాలు వెల్లడిస్తామన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మీరే ముఖ్యం... జాగ్రత్తగా వ్యవహరించండి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: సచివాలయాల ద్వారా సేవలందించటంలో ముఖ్యమైన గణాంక వ్యవహారాలలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎడ్యుకేషన్, ఎమినిటీస్ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పాలన వ్యవహారాలకు సంబంధించి ముఖ్యమైన గణాంక విషయాలకు సంబంధించి మరింత మెరుగ్గా, సమర్థవంతంగా ఉండాలని అన్నారు. క్యాష్ బుక్‌ల నిర్వహణ, అకౌంట్స్ వ్యవహారాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఎడ్యుకేషన్ కార్యదర్శులు సమీకరించిన నిధులను ఎప్పటికప్పుడు నగరపాలక సంస్థకు జమయ్యే విధంగా చూసుకోవాలన్నారు. కుళాయి చార్జీలు వసూలు చేస్తున్న ఎమినిటీస్ కార్యదర్శులు ఎప్పటికప్పుడు వసూలైన మొత్తాలను కార్పొరేషన్ ఖజానాకు జమ చేసే విధంగా చూడాలన్నారు. సమావేశంలో అకౌంటెంట్ నరసింహరాజు, జేఏవో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక


ఆండ్ర జలాశయం నుంచి నీటి విడుదలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఆండ్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేయించినట్టు విజయనగరం కార్పొరేషన్ ఈఈ టి.రాయల్‌బాబు వెల్లడించారు. నగర ప్రజలకు తాగునీటినందించే రక్షిత మంచినీటి పథకాల వద్ద పరిస్థితిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆండ్ర ప్రాజెక్టు వద్దకు వెళ్లి, అక్కడ విడుదలవుతున్న నీటి ప్రక్రియను పర్యవేక్షించారు. ఆండ్ర ప్రాజెక్టు గేట్ నెంబర్ 2 నుంచి చంపావతి నదిలోకి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచనలతో ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపి ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా నీటి విడుదలకు చొరవ చూపాలని కోరగా, అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఆండ్ర జలాశయం నుండి నేరుగా 40 కిలోమీటర్లు ప్రవహించి నెల్లిమర్ల వద్దనున్న చంపావతి నది వాటర్ ప్రాజెక్ట్ వద్దకు చేరుతుందన్నారు. అక్కడ ఇన్ఫిల్ట్రేషన్ ఊట బావుల నుంచి నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ ద్వారా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గల రిజర్వాయర్లకు నీటి పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఆండ్ర నుంచి నెల్లిమర్ల వద్దకు నీరు చేరేందుకు సుమారు వారం రోజులు కాలవ్యవధి పడుతుందని తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరమైన నీటిని మాత్రమే వినియోగించుకుని ఆన్ ఆఫ్ స్విచ్‌లను విధిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం: వాటర్ క్యాన్ల ద్వారా సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత తెలిపారు. గత నెల 20వ తేదీన సాక్షి పత్రికలో వచ్చిన డబ్బా నీరు సురక్షితమేనా అన్న కథనంపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు స్పందిస్తూ, తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రైవేటు వాటర్ ప్లాంట్లు డబ్బాల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని తనిఖీలు చేయమని సంబంధిత అధికారులను కోరనున్నట్లు తెలిపారు. అలాగే వాటర్ ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలు, కాలుష్య కారకాలను సమర్థవంతంగా నిర్వహించే విధంగా, కాలుష్యం లేకుండా చూసే విధంగా జిల్లాలోని అన్ని ప్లాంట్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ, రూరల్ మండలంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.సుదర్శనరావు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు ఎటువంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అటువంటి వారు వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ, మీ సేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి, విచారణ చేపట్టిన తర్వాత క్రమబద్ధీకరణ చేపడతామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నంబర్ 30 జారీ చేసిందని చెప్పారు.